


# భద్రము

**ఆశ్రయమైయున్న యేసయ్య నామమునకు మహిమ కలుగును గాక!**

**మూలవాక్యము :- మార్కు 14:44** ఆయనను అప్పగించువాడు నేనెవరిని ముద్దు పెట్టుకొందునో ఆయనే (యేసు); **ఆయనను పట్టుకొని భద్రముగా కొనిపోవుడని** వారికి గురుతు చెప్పియుండెను.

- **ఇస్కరియోతు యూదా ప్రధాన యాజకులకు చెప్పిన భద్రము :**

**మార్కు 14:44** ఆయనను అప్పగించువాడు నేనెవరిని ముద్దు పెట్టుకొందునో ఆయనే (యేసు); **ఆయనను పట్టుకొని భద్రముగా కొనిపోవుడని** వారికి గురుతు చెప్పియుండెను.

**ప్రభువైన యేసుక్రీస్తు Terrorist కాదు. శాంతి కాముకుడు. ఎన్నడూ ఎవరినీ కనీసం ఒక్క దెబ్బ కొట్టిన వాడు కాదు. అలాంటి వానిని కత్తులతో,గుదియలతో, బహుజనులతో వచ్చి బంధించి తీసుకెళ్ళాల్సిన అవసరం ఏంటి. పైగా యూదా భద్రముగా కొనిపోవుడని ఎందుకు అన్నాడు?**

- **ప్రధానయాజకులు పిలాతుకు చెప్పిన భద్రము :**

**మత్తయి 27:64-66** కాబట్టి మూడవ దినము వరకు **సమాధిని భద్రము చేయ** నాజ్ఞాపించుము; వాని శిష్యులు వచ్చి వానిని ఎత్తుకొనిపోయి ఆయన మృతులలోనుండి లేచెనని ప్రజలతో చెప్పుదురేమో, అప్పుడు మొదటి వంచన కంటె కడపటి వంచన మరి చెడ్డదై యుండునని చెప్పిరి. అందుకు పిలాతు కావలి వారున్నారు గదా మీరు వెళ్లి మీ చేతనైనంత మట్టుకు **సమాధిని భద్రము** చేయుడని వారితో చెప్పెను. వారు వెళ్లి కావలి వారిని కూడ ఉంచుకొని, **రాతికి ముద్రవేసి సమాధిని భద్రముచేసిరి.**

**యేసుక్రీస్తు ఖచ్చితంగా లేస్తాడు అని భయపడిన వారెవరంటే ప్రధానయాజకులు, పరిసయ్యులు.అందుకే యేసుక్రీస్తు తిరిగి లేచిన బయటికి రాకుండా సమాధి లోపలే ఉండే జాగ్రత్తలు తీసుకొమ్మని పిలాతుకు సలహా ఇచ్చారు. అయితే పిలాతుకు ఇది అసాధ్యమని తెలుసు. అందుకే సైనికులను " మీ చేతనైనంత మట్టుకు సమాధిని భద్రము చేయుడని వారికి చెప్పాడు."**

**వీరి సంగతి అలా ఉంచితే వాక్యం మనకు చెప్పిన భద్రం గురించి నేర్చుకుందాం.**

1. **దేవుడు తెలియజేయించిన మాటలు హృదయంలో భద్రము చేసుకోవాలి : లూకా 2:19,51** అయితే మరియ **ఆ మాటలన్నియు తన హృదయములో తలపోసికొనుచు భద్రము చేసికొనెను.** అంతట ఆయన వారితో కూడ బయలుదేరి నజరేతునకు వచ్చి వారికి లోబడి యుండెను. ఆయన తల్లి ఈ సంగతులన్నిటిని **తన హృదయములో భద్రము చేసికొనెను.**
2. **ధాన్యము భద్రము చేసుకోవాలి : ఆది 41:35** రాబోవు ఈ మంచి సంవత్సరములలో దొరుకు ఆహారమంతయు సమకూర్చి ఆ ధాన్యము ఫరో చేతికప్పగించి ఆయా పట్టణములలో **ఆహారమునకై భద్రము చేయవలెను.**

3. **పాపపరిహార జలము భద్రము చేయాలి : సంఖ్యా 19:9** మరియు పవిత్రుడైన యొకడు ఆ పెయ్య యొక్క భస్మమును పోగుచేసి పాళెము వెలుపలను పవిత్ర స్థలమందు ఉంచవలెను. పాపపరిహార జలముగా ఇశ్రాయేలీయుల సమాజమునకు దాని భద్రము చేయవలెను; అది పాపపరిహారార్థ బలి.
4. **రక్తం తినకూడదు - భద్రము : ద్వితీ 12:23** అయితే **రక్తమును తిననే తినకూడదు. భద్రము సుమీ.** ఏలయనగా రక్తము ప్రాణము; మాంసముతో ప్రాణాధారమైనదాని తినకూడదు;
5. **ప్రాణరక్షణ కొరకైన భద్రము : 1 సమూ 22:23** నీవు భయపడక నాయొద్ద ఉండుము, **నా యొద్ద నీవు భద్రముగా ఉందువు; నా ప్రాణము తీయచూచు వాడును నీ ప్రాణము తీయచూచువాడును** ఒకడే అని అబ్యాతారుతో చెప్పెను.
6. **హృదయమును భద్రము చేసుకోవాలి : సామె 4:20-23** నా కుమారుడా, నా మాటలను ఆలకింపుము నా వాక్యములకు నీ చెవి యొగ్గుము. నీ కన్నుల యెదుట నుండి వాటిని తొలగిపోనియ్యకుము **నీ హృదయమందు వాటిని భద్రము చేసికొనుము.** దొరికిన వారికి అవి జీవమును వారి సర్వశరీరమునకు ఆరోగ్యమును ఇచ్చును.నీ హృదయములోనుండి జీవధారలు బయలుదేరును కాబట్టి అన్నిటికంటె ముఖ్యముగా **నీ హృదయమును భద్రముగా కాపాడుకొనుము.**
7. **లెస్సయైన జ్ఞానమును వివేచనను భద్రము చేసుకోవాలి : సామె 3:21** నా కుమారుడా, లెస్సయైన జ్ఞానమును వివేచనను భద్రము చేసికొనుము వాటిని నీ కన్నుల ఎదుటనుండి తొలగిపోనియ్యకుము
8. **నోటిని నాలుకను భద్రము చేసుకోవాలి : సామె 21:23** నోటిని నాలుకను భద్రము చేసికొనువాడు శ్రమలనుండి తన ప్రాణమును కాపాడుకొనును.

<u>పరిశుద్ధ గ్రంధం చెప్పిన మరి కొన్ని భద్రములు:-</u>

1. **ఫరో మోషేకి చెప్పిన భద్రము : నిర్గమ 10:28** గనుక **ఫరో నా యెదుట నుండి పొమ్ము భద్రము సుమీ;** నా ముఖము ఇకను చూడవద్దు, నీవు నా ముఖమును చూచు దినమున మరణమవుదువని అతనితో చెప్పెను.

   **నీవు దేవుని పక్షముగా నిలిచి ఆయన పని చేస్తున్నప్పుడు శత్రువు నిన్ను బెదిరించడానికి ప్రయత్నిస్తూ భద్రం అని చెబుతారు.**
2. **పాపం భద్రము చేయబడెను : హోషేయ 13:12** ఎఫ్రాయిము దోషము నాయొద్ద ఉంచబడి యున్నది, **అతని పాపము భద్రము చేయబడియున్నది.**

   **నీవు నిజముగా దేవుని తట్టుకు తిరుగు వరకు నీ పాపం దేవుని వద్ద భద్రము చేయబడియుంటుంది**
3. **పౌలు, సీలలను చెరసాలలో భద్రము చేసిరి: అపో.కా 16:23** వారు **చాల దెబ్బలు కొట్టి వారిని చెరసాలలో వేసి భద్రముగా** కనిపెట్టవలెనని చెరసాల నాయకుని కాజ్ఞాపించిరి.




**వాగ్దానం :- దేవుడు నన్ను భద్రపరిచాడు: యోహాను 17:12** నేను వారి యొద్ద ఉండగా నీవు నాకు అనుగ్రహించిన వారిని నీ నామమందు కాపాడితిని; **నేను వారిని భద్రపరచితిని** గనుక లేఖనము నెరవేరునట్లు నాశనపుత్రుడు తప్ప వారిలో మరి ఎవడును నశింపలేదు.

## ALERTS:

**దేవుని మూలముగా పుట్టిన నేను నన్ను భద్రము చేసికొంటాను : 1 యోహాను 5:17** దేవుని మూలముగా పుట్టియున్న వాడెవడును పాపము చేయడని యెరుగుదుము. **దేవుని మూలముగా పుట్టిన వాడు తన్ను భద్రము చేసికొనును** గనుక దుష్టుడు వాని ముట్టడు

**ప్రొద్దునే లేస్తే మన తల్లిదండ్రులు మనకు భద్రం, జాగ్రత్త అని చెబుతున్నారు. మన పిల్లలను రోడ్డు దాటే దగ్గర భద్రం అని చెబుతున్నాం. వయసొచ్చిన ఆడపిల్లలకు మగ పిల్లలతో భద్రం అని చెబుతున్నాం.**

**కాని సంఘం విశ్వాసులను ఏ విషయాల్లో భద్రంగా ఉండాల్నో,ఎలా భద్రం చేసుకోవాలనో నేర్పించట్లేదు. అందుకే మన యౌవ్వన బిడ్డలు సాతాను చేతిలో బందీలుగా చిక్కి, ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఏ బిడ్డలు సంఘానికి మూలకంభాలుగా ఉండాల్నో వారు కూలిపోతే సంఘాలు ఎలా నిలబడతాయి.రండి. మన బిడ్డలను మందిరాలకు అంటుకడుతాం. మూలకంభాలుగా రుపుదిద్దుదాం.**

**యౌవ్వనస్తులారా, మీరు అపవాదిని జయించారు అన్న వాక్యాన్ని నిజం చేద్దాం. అందుకే యౌవ్వనస్తులారా మందిరములో వసించండి. వాక్యం నేర్చుకోండి. ఆత్మతో సత్యంతో ఆరాధించండి. ఎజ్రా, నెహెమ్యాల వలె సంఘాలు బలపరచండి. సంస్కరించండి. ఆత్మ పూర్ణులుకండి. యౌవ్వనేచ్ఛలను, శరీరేచ్ఛలను ఆత్మ చేత చంపివేయండి, రగలండి, ప్రజ్వరిల్లండి.**

**యేసుక్రీస్తు యొక్క యౌవ్వన రక్తం మీ కోసం సంపూర్ణంగా కార్చారు. కనీసం మీ చెమటనైనా ధారపోయండి. మీ కన్నీళ్లు విడవండి. ఒక క్రొత్త ఉజ్జీవాన్ని ఈ దేశంలో, ఈ ప్రపంచంలో, ఈ చివరి దినాల్లో తీసుకురండి. అలా మిమ్మును దేవుడు మీకు సహాయం దయచేయును గాక!.... ఆమెన్...ఆమెన్.... ఆమెన్.....**